ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 24
సంచిక : 24
పేజీలు : 3

ఆదివారం, ఆగస్టు 24, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## యూరియా కట్టకోసం తిప్పలు

**టీ మీడియా,ఆగస్టు23, సింగరేణి (కారేపల్లి) :**



యూరియా కట్ట కోసం రైతుకు తిప్పలు తప్పటం లేదు. రెండు రోజులుగా యూరియా కోసం ఎదురుచూస్తున్నా రాక పోవటంతో రైతుకు కోపం కట్టలు తెంచుకుంది. తమకు యూరియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కారేపల్లిలో రైతులు శనివారం రోడెక్కారు. కొమరం భీం సెంటర్‌లో రోడ్డుపై రైతులు భైటాయించి అందోళనకు దిగారు. రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని, వెంటనే అధికారులు స్పందించి కారేపల్లి సోసైటీకి యూరియా రప్పించాలని డిమాండ్ చేశారు. రైతులు అందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర యూరియా కొరత లేకుండా చూడాలాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కారేపల్లి ఎస్సై బైరు గోపీ రైతులతో మాట్లాడి వారిని

మిగతా 2లో

# ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు

### -జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**టీ మీడియా ,ఆగస్టు23,భద్రాద్రి కొత్తగూడెం**



: ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శనివారం ఐడిఓసీ కార్యాలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకావాలని అన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని చెప్పారు. మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలుపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని చెప్పారు. మన జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి నిమజ్జనానికి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లో మాత్రమే అత్యంత భద్రత మధ్య నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళికరూపొందించుకోవాలని, గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని చెప్పారు. నిమజ్జనం రూట్ లో అవసరమైన రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణాశాఖ అధికారి నుండి ధ్రువీకరణ తీసుకోవాలని చెప్పారు. ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేయాలని, గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టు దిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తిపాటలు మాత్రమే వినిపించాలని, మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలని చెప్పారు. అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి రెచ్చగొట్టే అంశాల జోలికి వెళ్లవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లు వినియోగించాలని, గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో కలిసికట్టుగా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని చెప్పారు. భక్తులకు అందించే స్వామి వారి ప్రసాదాలకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని చెప్పారు. వ్యర్థాలు వేసేందుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసే విగ్రహాలు పర్యావణానికి హాని కలిగిస్తాయన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేయనున్నామని, ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ శ్రీమతి విద్యా చందన,డిపిఒ చంద్రమౌళి,డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, కొత్తగూడెం, ఆర్డీవో మధు,మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి పట్టుబడ్డ సీఐ రాజేష్

**టి మీడియా, ఆగస్టు 23,డోర్నకల్:**



డోర్నకల్ మునిసిపాలిటీ పరిదిలో ఒక అక్రమ కేసులో బాతుడికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు గాను పట్టణ సిఐ రాజేష్ బాడితుడి నుండి 50 వేల రూపాయల డిమాండ్ చేశాడు.అందులో భాగంగా బాదితుడు 30 వేల రూపాయలు సిఐ రాజేష్కి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్గా వల పన్ని పట్టుకున్నారు.

## నిత్య పెళ్లి కొడుకుగా మారిన కానిస్టేబుల్

### -ఐదో పెళ్లికిబుక్కయ్యాడు.

**టీ మీడియా ,ఆగస్టు23,సూర్యాపేట:**



ఓ పోలీస్ కానిస్టేబుల్ నిత్య పెళ్లి కొడుకుగా మారాడు. ఒకరు కాదు ఇద్దరు ఏకంగా నలుగుర్ని పెళ్లి చేసుకున్నాడు. ఐదో పెళ్లికి కూడా సిద్ధమయ్యాడు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లటంతో అడ్డంగా బుక్కయ్యాడు. ఉద్యోగం ఊడింది. బాలికను పెళ్లి చేసుకున్న కారణంగా ఫోక్సో చట్టం కింద కేసు కూడా నమోదు అయింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణంరాజు అనే వ్యక్తి నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.కృష్ణంరాజు నిత్య పెళ్లి కొడుకుగా మారాడు. ఏకంగా నలుగుర్ని పెళ్లి చేసుకున్నాడు. నలుగురిలో ముగ్గురు యువతులు కాగా.. ఓ బాలిక కూడా ఉంది. కొద్దినెలల క్రితమే బాలికతో పెళ్లయింది. నాలుగు పెళ్లిళ్లు అయినా కూడా అతడు ఆగలేదు. ఐదో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలోనే అతడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. ఈ కేసుపై ఎస్పీ నరసింహ విచారణ చేశారు. నిజమని తేలటంతో సీరియస్ అయ్యారు. కృష్ణం రాజును విధులనుంచి సస్పెండ్ చేశారు. బాలికను పెళ్లి చేసుకున్నందుకు గానూ అతడిపై ఫోక్సో చట్టం కింది కేసు కూడా ఫైల్ అయింది.

## గురుకులంలో తహశీల్దార్ ఆకస్మిక తనిఖీ

**టీ మీడియా ఆగస్టు 23 ముదిగొండ**

:మధిర మండలం కృష్ణాపురంలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/ కళాశాల,ముదిగొండ నందు శనివారం ఆకస్మిక తనిఖీ జరిగింది.ముదిగొండ మండలం, మండల తహసీల్దార్ సునీత ఎలిజబెత్ శనివారం ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది అనంతరం ఆమె కళాశాలను నిశితంగా పరిశీలించి అన్ని కోణాలలో తనిఖీ చేసి, పరిశుభ్రత, వైద్య సదుపాయాలు మరియు ఆహార విషయాల గురించి విద్యార్థులతో మాట్లాడి ఆరా తీశారు. వివిధ విషయాలలో సంబంధిత కాంట్రాక్టర్లను సమాచారం అడిగి తెలుసుకుని మరికొన్ని సూచనలు చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులుతో మాట్లాడుతూ, విద్యార్థుల విషయంలో సిబ్బంది పూర్తి అప్రమత్తత కలిగి ఉండాలని, ప్రభుత్వం గురుకులాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అనేక సదుపాయాలు కల్పిస్తుండగా వాటిని పూర్తిగా విద్యార్థులకు అందించే విధంగా కృషి చేయాలని సూచించారు.



# సృజనాత్మక ప్రోత్సాహకమే బ్యాగ్ లెస్ ఉద్దేశం

### -జిల్లా కలెక్టర్అనుదీప్ దురిశెట్టి

**టీ మీడియా ,ఆగస్టు23,ఖమ్మం:**



విద్యార్థుల్లో అభిరుచి, ఆసక్తిని బట్టి ఆటలు, సంగీతం, నృత్యం, కళలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడానికి ప్రోత్సహించడమే బ్యాగ్ లెస్ డే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పిల్లలకు చదువుల ఒత్తిడిని తగ్గిస్తూ, ఏకాగ్రతను పెంచుతూ ఉల్లాసపూరిత వాతావరణం ఉండేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.శనివారం, నెలలో నాలుగవ శనివారం నిర్వహించే బ్యాగ్ లెస్ డే కార్క్యకమంలో భాగంగా స్థానిక ఇందిరనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు కాగితపు బొమ్మలు పూలతో కలిపి చేసిన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకడంతో కలెక్టర్ మురిసిపోయారు. పిల్లలు తయారు చేసిన గ్రీటింగ్ కార్డ్స్, పోస్టర్ డిజైనింగ్, ఫజిల్స్ సాల్వింగ్, పేపర్ తో చేసిన పలు ఆకృతులను కలెక్టర్ తిలకించారు. నృత్యం, సంగీతం, పలు గీతాలు, గేయాలాపన, ప్రసంగాలు వంటి ప్రదర్శనలను ఆస్వాదించారు. ముఖ్యంగా మట్టి, పిండితో వినాయక విగ్రహాలు తయారు చేసిన విద్యార్థుల సామర్థ్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి పాఠశాలల్లో విద్యార్థులపై పుస్తకాలు, హెూంవర్క్ బరువును తగ్గించి, ఆటపాటలు, క్రీడలు, కళలు, పర్యావరణ పరిరక్షణ అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేందుకు వీలు కల్పించడం, చదువులపై ఏకాగ్రత పెంచడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులు తమ బరువైన బ్యాగులను నెలలో ఒక్కసారైనా పాఠశాలలకు తీసుకెళ్లకుండా ఆనందాన్ని కలిగించేందుకు వీలును బట్టి మ్యూజియం, చారిత్రక ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల సందర్శన, సైన్స్ ప్రయోగాలు, విద్యపై స్కిట్, పతంగుల తయారీ, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గణిత కార్నర్, రంగోలి, మోడల్ ఎన్నికలు, మాక్ అసెంబ్లీ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, బేస్డ్ లెర్నింగ్, ఆటలు, సంగీతం, నృత్యం, కళలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడానికి విద్యార్థులకు అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి నెలలో నాలుగో శనివారం జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో బ్యాగ్ లెస్ డే గా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పండుగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా వినాయక చవితి పండుగ రోజున మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కన పెట్టి, పర్యావరణ హిత మట్టి గణపతులకు ప్రాధాన్యమిద్దామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు.

# కేంద్ర, రాష్ట్ర పాలకులకు పట్టని రైతు ఘోస

**మాజీ సర్పంచ్ కరపటి రాములు వర్ధంతి**

**టీ మీడియా,ఆగస్టు23,సింగరేణి(కారేపల్లి):** రాష్ట్రానికి యూరియా సరఫరాలో బీజేపీ ప్రభుత్వ వివక్షత, ముందుచూపులేని రాష్ట్ర ప్రభుత్వ చేతలతో రైతులు ఘోస పడుతున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు విమర్శించారు. శనివారం కారేపల్లి మండలం పాటిమీదిగుంపులో మాజీ సర్పంచ్ అమరజీవి కరపటి రాములు 12 వ వర్ధంతి నిర్వహించారు. పార్టీ పతాకాన్ని కరపటి సీతారాములు ఆవిష్కరించారు. ఈసందర్భంగా దారావత్ వినోద్ అధ్యక్షతన జరిగిన సభలో బంతు రాంబాబు మాట్లాడుతూ యూరియా కొరత కు బాధ్యులు మీరంటే మీరని కేంద్ర,రాష్ట్ర పాలకులు ఆరోపించుకుంటూ రైతులను పట్టించుకోవటం లేదన్నారు. రైతులు చేలు పనులు పక్కన పెట్టి యూరియా కోసం తెల్లవార్లు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా సరఫరాపై రైతులకు సరైన సమాచారం ఇవ్వక పోవటంతో రైతులలో అసహనం పెరిగి [illegible] రోడ్డెక్కుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వం అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై 11 శాతం పన్నులు ఎత్తివేసి దేశంలోని పత్తి రైతులు తీవ్రంగా నష్టపోనున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల లబ్దికోసం హామీలు ఇచ్చి వాటిని అమలుకు ఎలాంటి కార్యాచరణ కు దిగక పోవటంతో ప్రజలను మోసం చేయటమేనన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అమరులైన కరపటి రాములు వంటి త్యాగధనుల స్పూర్తిపోరాటాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కరపటి రాములు కుటుంబం పార్టీ బలమైన శక్తి అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కే.నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, మండల కమిటీ సభ్యులు సురభాక ధనమ్మ, వల్లేబోయిన కొండలరావు, యనమనగండ్ల రవిబాబు, సురభాక సర్వయ్య, మాజీ సర్పంచ్ కరపటి రాంబాయి, నాయకులు కరపటి లక్ష్మయ్య, మన్నెం బ్రహ్మయ్య, ధరావత్ రవికుమార్, బచ్చల వెంకన్న, బచ్చల బుజ్జమ్మ, ధరావత్ సరిత, అంగడి వెంకన్న, ధరావత్ లాలు, ఈసం వీరస్వామి, భూక్య శ్రీను,వెంకటేష్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.





## సమస్యల పై తహసిల్దార్ కి వినతి పత్రం

**టీ మీడియా, ఆగస్టు 23 ,కొణిజర్ల:**
స్థానిక సమస్యలు పరిష్కరించాలి అని తహసిల్దార్ కి మరియు ఎంపీడీవో ఉపేంద్రయ్య కి మండలం అధ్యక్షులు కవిడ మురళి కృష్ణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.కొణిజర్ల మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించిన అనంతరం కొణిజర్ల మండలం లో గల అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యలపై తహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు .వీటిని తక్షణమే పరిష్కరించకపోతే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామని అన్నారు.అదే విధంగా పెసర పంటలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం సరియైన మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బండారు నరేష్ అడ్వకేట్, జిల్లా అధికార ప్రతినిధి వీరవెల్లి రాజేష్ అడ్వకేట్, మండల ఉపాధ్యక్షులు యాస సత్యనారాయణ, నోముల జనార్ధన్, మండల కార్యదర్శి గూగులోత్ కుమార్ నాయక్, కొమ్మగిరి బాలకృష్ణ, వెంకటేష్, జోగు వీరభద్రం, ఇజ్జగని వెంకన్న, చిర్ర నరేష్,వాంకుడోత్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగలు

**- నిబంధనలు పాటించాలి**

**-సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతిరెడ్డి,**



**టీ మీడియా, ఆగస్టు 23, కామేపల్లి** :గణేష్ మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని కారేపల్లి సిఐబి తిరుపతి రెడ్డి అన్నారు. కామేపల్లి పీఎస్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మండపాలు ఏర్పాటుకు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని అన్నారు. మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు. ప్రజా రవాణా కి ఎమర్జెన్సీ వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. స్థలం ఏర్పాటు కోసం సంబంధిత శాఖ వారితో అనుమతులు తీసుకోవాలని అన్నారు. నిర్వాహకుల ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేసుకోవాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు రాత్రి 10: గంటల వరకు మాత్రమే స్పీకర్ఉపయోగించుకోవాలని అన్నారు. శోభయాత్ర సమయాల్లో డీజే లను ఉపయోగించ రాదని అన్నారు. మద్యం సేవించడం అసభ్యకరమైన నృత్యాలు, పేకాట పూర్తిగా నిషేధించడమైందని అన్నారు. పోలీస్ అధికారులు వచ్చినప్పుడు పాయింట్ పుస్తకం విధిగా సంతకం చేయించుకోవాలని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారులను లేదా, 100 నంబర్ ను సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కామేపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్. ఏఎస్ఐ.... స్టేషన్ సిబ్బంది. అన్ని మతాల గురువులు. యువకులు తదితరులు పాల్గొన్నారు.



## మణుగూరులో సింగరేణి డైరెక్టర్ (పి పి)

**టి మీడియా, ఆగస్టు 23,పినపాక ప్రతినిధి:**
సింగరేణి డైరెక్టర్( ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె వెంకటేశ్వర్లు శనివారం మణుగూరు జిఎం దుర్గం రాంచందర్ తో కలిసి మణుగూరు ఏరియాలో పర్యటించారు. తొలుత పగిడేరు సింగరేణి జియో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ను సందర్శించారు. ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యం 20 కిలో వాట్స్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంపుకు అవకాశాలు పరిశీలించాలని సంబంధిత అధికారులతో సమాలోచనలు జరిపారు. అనంతరం పీ కే ఓసి 4 సందర్శించారు. వర్షాల కారణంగా ఉపరితల గనుల లోకి చేరిన వర్షపు నీటిని వీలైనంత త్వరగా నీటి పంపులతో బయటకు ఎత్తి పోయాలని,బొగ్గు ఉత్పత్తి ఆటంకాలు అవాంతరాలు నివారించాలని,యంత్ర సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమిష్టి కృషి చేయాలని, పని గంటలు పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏరియా అధికారులతో కలిసి మణుగూరు ఓసి ని కూడా సందర్శించారు. బొగ్గు రవాణాకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు లేకుండా తగుచర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిఎం ( ఆర్ %ఆ%డి ) కనకయ్య , జిఎం, డీజీఎం ( ఎక్స్ ఫ్లోరేషన్ ) శ్రీనివాస్ , రాజ్ కుమార్, డీజీఎం ( ఆర్ %ఆ% డి) శ్రీనివాస్, ఎస్ ఓ టు జి ఎం బి. శ్రీనివాస చారి , డి జి ఎం ( సర్వే) దయాకర్, మేనేజర్( మణుగూరు ఓసి ) బైరెడ్డి వెంకటేశ్వర్లు , ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్ , మణుగూరు ఏరియా ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్ , బాబు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీవో ఆకస్మిక తనిఖీలు



**టి మీడియా, ఆగస్టు 23,పినపాక ప్రతినిధి:**
అశ్వాపురం మండల కేంద్రం సమీపంలోని గొల్లగూడెం బ్రిడ్జి వద్ద శనివారం ఉదయం ఆర్టీవో ఫరూక్ వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా వాహన టాక్స్ లను పరిశీలించి వాహనదారులు త్రైమాసిక సమయానికి తమ వాహనాలకు టాక్స్ లు చెల్లించాలని తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనం నడపడం నేరమని,వాహన దారులు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించాలని , వాహనాలతో పాటు లైసెన్సులు ఉంచుకోవాలని, సెల్ ఫోన్లు మాట్లాడుకుంటూ వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని,రోడ్డు భద్రతలు పాటించాలని సూచించారు. సరైన ధృవపత్రాలు లేని వాహనాలకు చలాన్లు విధించారు.

## లక్ష్యంతో ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**-ఏఎస్ఐ రామచంద్రారెడ్డి**



**టి మీడియా ,ఆగస్టు 23, అశ్వాపురం:**
విద్యార్థులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ, లక్ష్యంతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎ ఎస్సై రామచంద్రారెడ్డి అన్నారు.శనివారం అశ్వాపురంమండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు గొందిగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై అశ్వాపురం పోలీసులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్, ర్యాగింగ్ , గంజాయి, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సైబర్ నేరాలు వాటి వల్ల కలిగే అనర్థాల గురించి ఏఎస్ఐ రామచంద్రారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినీ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యోగిత వేణి, చందు, పాఠశాలల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధుల సంరక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి

**సివిల్ జడ్జి ప్రశాంతి**



**టి మీడియా, ఆగస్టు 23 ,మధిర:** వయో వృద్ధుల సంరక్షణ సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మధిర సివిల్ జడ్జి ప్రశాంతి అన్నారు. శనివారం మధిర మండల న్యాయ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో వయో వృద్ధుల సంరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వయో వృద్ధులు, తల్లిదండ్రుల సంరక్షణార్థం అమలులో ఉన్న చట్టాలను తెలుసుకోవాలన్నారు. వారి సమస్యల పరిష్కారానికి అవలంబించాల్సిన చట్ట బద్ధమైన మార్గాలు వివరించారు.అవసరమైనప్పుడు కోర్టు ఆవరణలో గల 'న్యాయ సేవా సంస్థ' వారి సహకారం ఉచితంగా పొందవచ్చు అని తెలిపారు. అనంతరం న్యాయమూర్తిని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ బాధ్యులు శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పారుపల్లి వెంకటేశ్వరరావు, తెలంగాణ వయో వృద్ధుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవరపు నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది చావలి రామరాజు, రిటైర్డ్ ఉద్యోగులు, న్యాయ సేవా సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.



## చిట్టి చేతులు - గట్టి సంకల్పం

**-స్మార్ట్ కిడ్జ్ లో ఆకట్టుకున్న ఎకో ఫ్రెండ్లీ గణనాథుల తయారీ**



**టి మీడియా,ఆగస్టు 23,ఖమ్మం**
:స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం పాఠశాల చిన్నారులు తమ చిట్టి చేతులతో ఎకో ఫ్రెండ్లీ గణనాథులను తయారు చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ గణపయ్యాలనే పూజించాలని తెలియజేస్తూ చిన్నారులు ఉత్సాహంగా ఎకో ఫ్రెండ్లీ గణపతులను తయారు చేశారు.వివిధ రూపాలలో వినాయక ప్రతిమలను అందంగా రూపొందించారు. మట్టి గణపయ్యలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. పలు రకాల కూరగాయలతో, పండ్లతో ,పూలతో ,దినుసులతో, బియ్యం, బిస్కెట్స్ , ఇడ్లీ, ఆకులు పలు రకాల ఆకృతులలో గణనాథులకు రూపం ఇచ్చారు.అనంతరం చిన్నారులు రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలతో నగరంలోని పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మట్టి గణపయ్యలనే పూజించాలని,పర్యావరణాన్ని రక్షించాలని, రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలను పూజించకుండా పర్యావరణానికి రక్షణ కల్పించాలని కోరుతూ జరిపిన ర్యాలీ అందరిని విశేషంగా ఆకట్టుకుని, చైతన్యపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, భక్తులందరూ మట్టి వినాయకులతోనే గణేష్ వేడుకలను, పూజా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.పర్యావరణాన్ని, చెరువులను, నీటి వనరులను కాలుష్యరహితంగా ఉంచడానికి ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలకే పూజలు జరపాలని తెలియజేశారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా తమ పాఠశాలలో కాలుష్యరహిత పర్యావరణ రక్షణ కోసం ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలనే పూజించాలని అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులతోనే మట్టి గణపయ్యలు తయారు చేయడం జరిగిందని తెలిపారు గణేష్ వేడుకలను పర్యావరణహితంగా, ఆధ్యాత్మికంగా, కాలుష్య రహితంగా ప్రజలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా కట్టకోసం తిప్పలు

సముదాయించారు. ఆందోళన వద్దకు మండల వ్యవసాయాధికారి బట్టు అశోక్‌కుమార్ చేరుకొని రైతులతో మాట్లాడారు. యూరియా కోసం ఉన్నతాధికారులతో మాట్లాడారు. 15 టన్నుల యూరియా ఆదివారం కారేపల్లి సొసైటికి రప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏవో రైతులకు తెలిపారు. దానిని ఆదివారమే పంపిణి చేపట్టుతామని రైతులకు ఏవో హామీ ఇవ్వటంతో వారు శాంతించారు.

## సురవరం సుధాకర్ రెడ్డి మృతి

**- మాజీ ఎంపీ నామ సంతాపం**

**టీ మీడియా ,ఆగస్టు23,ఖమ్మం:**సిపిఐ దిగ్గజ నేత, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రెండుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికైన ఆయన ప్రజా సమస్యలపై ధైర్యంగా పోరాడారని కొనియాడారు. ప్రజల కోసం ఎల్లప్పుడూ నిబద్ధతతో పనిచేసి, దశాబ్దాలపాటు సిపిఐలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన నీతి, నిజాయితీ, త్యాగస్ఫూర్తి అందరికీ ఆదర్శమని, పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడి, నిరాడంబరంగా జీవించారని గుర్తుచేశారు. స్వాతంత్ర సమరయోధుడు వెంకట్రామిరెడ్డి కుమారుడిగా తెలుగు ప్రజలకు గౌరవం తెచ్చారని, సిపిఐలో క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచారని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఆయన ప్రసంగాలు మేధావులను ఆకట్టుకోవడమే కాకుండా, ఆయన ఆలోచనలు కొత్త తరాలకు మార్గదర్శకమని తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష ఉద్యమాలకే కాకుండా తెలుగు ప్రజలకు కూడా తీరని లోటు అని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**టీ మీడియా ,ఆగస్టు23,కోదాడ :** కోదాడ మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు లక్ష్మీపురంలో రూ.3 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పనుల జాతరతో నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు చెప్పారు. ఈ కార్య క్రమంలో నాయకులు రావెళ్ల కృష్ణారావు, లైటింగ్ ప్రసాద్, మేకపోతుల సత్యనారాయణ, ముస్తఫా, నిజాం, కృష్ణబాబు, వీరబాబు, జానీ, పగ్గిళ్ల వెంకన్న, రఫీ, లక్ష్మి, బొబ్బమ్మ, పున్నమ్మ, అపరాజ్యం పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

**-జిల్లా జడ్జి వసంత్ పాటిల్**



**టీ మీడియా ,ఆగస్టు23,ఇల్లెందు** : పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు జడ్జి వసంత్ పాటిల్ కాంట్రాక్టర్లకు సూచించారు. ఇల్లెందు కోర్టును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గత ఐదు నెలలుగా నిర్మాణంలో ఉన్న మరమ్మతు పనులను పర్యవేక్షించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అంతకుముందు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి జిల్లా కోర్టు జడ్జికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఇల్లెందు బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు.బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇల్లెందు కోర్టులో న్యాయవాదులు, కక్షిదారుల కోసం శౌచాలాయాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్, సీనియర్ న్యాయవాదులు పెద్దూరు నరసయ్య, దంతాల ఆనంద్, ఎస్.వి.నరసయ్య, పి.గోపీనాథ్, కె.నారాయణ, పి.బాలకృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, బి.రవికుమార్ నాయక్, ఎస్.సత్యనారాయణ దొర, ఎస్.బన్సీలాల్, ఏఓ జె.కిరణ్ కుమార్, జిల్లా కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.

## న్యాయవాదులు అందరికీ హెల్త్ కార్డులు అందజేయాలి

**-జనపరెడ్డి గోపికృష్ణ**

**టీ మీడియా ,ఆగస్టు23,భద్రాద్రి కొత్తగూడెం :** బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో ఎన్‌రోల్ అయిన న్యాయవాదులు అందరికి వెంటనే హెల్త్ కార్డులు అందజేయాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ జనపరెడ్డి గోపికృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని ఐ.ఎల్.పి.ఏ జిల్లా కార్యాలయంలో అడ్వకేట్ యర్రపాటి కృష్ణ అధ్యక్షతన జరిగిన క్రియాశీలక సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న హెల్త్ కార్డులు 2019 తర్వాత ఎన్‌రోల్ అయిన న్యాయవాదులకు హెల్త్ కార్డులు పంపిణీ చేయడం లేదదన్నారు. తద్వారా గత ఆరు సంవత్సరాలుగా కొత్తగా ఎన్‌రోల్ అయిన న్యాయవాదులకు హెల్త్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని వెంటనే సమస్య పరిష్కారించాలన్నారు.ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జాతీయ స్థాయిలో న్యాయవాదుల అభివృద్ధి కోసం, అందరు న్యాయవాదులకు అన్ని రంగాల్లో సమాన హక్కులు రావడం కోసం పని చేస్తుందన్నారు. పూలే, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న ఐ.ఎల్.పి.ఏ లో యువ న్యాయవాదులు చేరి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎల్.పి.ఏ భాధ్యులు అంబటి రమేశ్, డి.సామంత్, మహమ్మద్ సాదిక్ పాషా, ఎస్.భానుప్రియ, మారపాక రమేశ్, కాకాటి నీలివేణి, నందిని, అంకుశ్ పాషా,పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తేవాలి.

**వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**

**టీ మీడియా,ఆగస్టు, 23, కామేపల్లి:**

తెలంగాణ వ్యవసాయ ్ష్రమిక సంఘం కామేపల్లిమండల మహాసభ పింజరమడుగులో కిన్నెర రామచంద్రయ్య యు ఉమా అధ్యక్షతన జరిగింది .సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నంలో భాగంగా కేంద్రంలో 50 లక్షల 60 వేల కోట్ల బడ్జెట్ పెరిగిన కేవలం 69 వేల కోట్లు కేటాయించి ఉపాధి కూలీలకు కూలి గిట్టుబాటు కాకుండా అన్యాయం చేస్తుందని ఆయన విమర్శించారు .గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ పనులు తగ్గి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న కూలీలకు పని కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఉపాధికి నిధులు తగ్గించడం వల్ల ఇతర పనులకు కారు చౌకగా కూలీలు శ్రమదోపిడికి గురవుతున్నారని ఆయన విమర్శించారు. సంవత్సరంలో ప్రతి సభ్యుడికి 200 రోజులు పని కల్పించాలని, ఆయన డిమాండ్ చేశారు. కూలీల రక్షణకు ,భద్రతకు, కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు .ఇప్పటికే వ్యవసాయ కూలీలకు,ఉపాధి కూలీలకు , పౌష్టిక ఆహారపదార్థాలు, కుటుంబ అవసరాలకు అందుబాటులో లేక పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని పేద కుటుంబాల పోషణ, రక్షణ, కోసం ప్రతి కూలి కుటుంబానికి నెలకు పదివేల రూపాయలు ప్రభుత్వం ఇచ్చి రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం ఐక్యంగా పోరాటం నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ




అధికారంలోకి రావడానికి ముందు స్విస్ బ్యాంకు లో ఉన్న 75 లక్షల కోట్ల నల్లధనాన్ని తెచ్చి పేదల బ్యాంక్ అకౌంట్లో ప్రతి కుటుంబానికి 15 లక్షలు ఇస్తానని వాగ్దానం చేశాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు మహిళలకు ప్రతినెలా 2500 ఇస్తానని హామీ ఇచ్చారు. అమలు చేయాలన్నారు. బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు .సమగ్ర కూలి చట్టం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేరళ తరహాలో చట్టం చేయాలని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో కూలీరేట్లను నిర్ణయించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు

## విద్యుత్ లైన్లు తొలగించేందుకు చర్యలు

**టీ మీడియా ,ఆగస్టు 23, ముదిగొండ :**

ముదిగొండ మండల పరిధిలోని వెంకటాపురం పరిధిలో ఎస్సీ అండ్ బీసీ కాలనీలో ఇండ్ల మీద నుంచి వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్స్ మార్చడం కోసం స్థానికలు గతంలో ప్రజావాణి లో పిర్యాదు మేరకు 11 కేవీ లైన్ మార్చడం కోసం అంచనాలు వేసి ముదిగొండ నుంచి గోకినపల్లి రహదారి వెంబడి వేయడానికి విద్యుత్ శాఖ నుంచి అన్ని అనుమతులు ఇచ్చి మరియు పనులు కూడా ప్రారంభించడం జరిగింది,కానీ ముదిగొండ నుంచి గోకనపల్లి రహదారి పక్కనే వున్న వినియోగదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ లైన్ వేయకుండా నిలిపి వేయడమైంది. ఇట్టి విషయం మీద స్థానిక వెంకటాపురం ఎస్సీ మరియు బీసీ కాలనీ వాసులు తిరిగి ఖమ్మం కలెక్టర్ ప్రజావాణి లో ఫిర్యాదు చేయడమైనది.ఈ విషయం మీద ఖమ్మం జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండెంగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, డివిజనల్ ఇంజనీర్ సీహెచ్.నాగేశ్వరరావు మరియు ఆర్ అండ్ బీ కి చెందిన ఈఈ మరియు స్థానిక విద్యుత్ శాఖ ఏఈ ఏడిఈ పాల్గొని వారి స్థానికులు అభిప్రాయాలు తెలుసుకోవడం జరిగింది.రోడ్డు వెడల్పు చేసే పనులు జరుగుతున్నందున రోడ్డు క్లియరెన్స్ చూసుకుని అట్టి లైన్ ను వీల్కెనంత త్వరలో ఇండ్ల మీద నుంచి మార్పిస్తామని సూపరింటెండెంట్ సూపరింటెండెంగ్ ఇంజనీర్ ఖమ్మం తెలిపారు.ఈ పనులు చేయుటకు స్థానికులు సహకరించాలని విద్యుత్ శాఖ ముదిగొండ ఏడిఈ బి రామకృష్ణారావు తెలిపారు.

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**-వ్యవసాయ అధికారిణి ఎస్.సరిత**



**టీ మీడియా ,ఆగస్టు 23, ముదిగొండ**

ముదిగొండ మరియు మేడేపల్లి సొసైటీ ఇతర ప్రైవేట్ డీలర్ షాపుల నందు యూరియా అందుబాటులో ఉందని ఇప్పటివరకు 830 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా 790 మెట్రిక్ టన్నుల యూరియా నియంత్రణ రైతులు వినయోగించుకోవడం జరిగిందని ఇంకా 40 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని ముదిగొండ మండల వ్యవసాయ అధికారి సరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు మండలంలో యూరియా కొరత అనేది లేదని కావున రైతులందరూ ఎలాంటి ఆందోళన చెందకుండా యూరియా ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## మట్టి అక్రమ తోలకాలు.

**టీ మీడియా, ఆగస్టు 23 ,బోనకల్లు:** ఖమ్మం జిల్లా బోనకల్లు మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో అసైన్డ్ భూముల నుండి దర్జాగా మట్టి అక్రమ తోలకాలు సాగుతున్నాయి. ఈ మట్టి తోలకాలపై సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారుల అనుమతి లేకుండా ట్రాక్టర్లతో తోలకాలు జరుపుతూ పలువురు అక్రమార్జనకు తెరలేపారు. అనుమతులు లేని తోలకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఈ అక్రమ తోలకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ట్రక్కు మట్టి సుమారు రూ.1,500 వరకు విక్రయిస్తూ యదేచ్ఛగా మట్టి తోలకాలు జరుపుతున్నారు. అధికారుల పర్యవేక్షణ చర్యలు కొరవడడం వల్లే ఈ మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



**మాంటిస్సోరి స్కూల్ లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు**

## ఘనంగా నిర్వహించిన పాఠశాల సిబ్బంది

**టీ మీడియా ,ఆగస్టు23,సింగరేణి(కారేపల్లి)**

:మండల కేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థినీ,విద్యార్థులు శ్రీకృష్ణ,గోపికల వేషధారణతో అందర్నీ ఆకట్టుకున్నారు.ఎంతో సంతోషంగా,తమ స్నేహితులతో కలిసి పాఠశాల విద్యార్థులు విభిన్నమైన వేషధారాలతో తో సందడి చేశారు.పాఠశాల బోధనా సిబ్బంది విద్యార్థులు శ్రీకృష్ణాష్టమి విశిష్టతను గురించి విద్యార్థులకు తెలియజేశారు.ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ మినిజోజో,ఉపాధ్యాయులు, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలను తనిఖీచేసిన అధికారులు



**టీ మీడియా,ఆగస్టు23,సింగరేణి(కారేపల్లి) :**

కారేపల్లి మండలంలోని కారేపల్లి మోడల్‌స్కూల్, గాంధీనగర్ గిరిజన సంక్షేమ గురుకులం, తెలంగాణ ఏకలవ్య మోడల్ గురుకులంలను మండల అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. మోడల్ స్కూల్, గిరిజన గురుకులాలను ఏంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేంద్రరావులు, ఏకలవ్య పాఠశాలను వ్యవసాయాధికారి బట్టు అశోక్‌కుమార్, ఏఈవో బీ.నరేష్‌లు తనిఖీలు చేసారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతులు, వంట రూము, స్టాక్ రూములను పరిశీలించారు. విద్యార్థిని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ, విద్యార్థులకు ప్రభుత్వం ఆదేశానుసారం వేడి వేడి అన్నం వడ్డించాలని, మెనూ క్రమం తప్పకుండా పాటించాలని సూచించారు.

## రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు పనులు కల్పించాలి

**మోడీ విధానాలతో ప్రభుత్వ రంగం దివాళా - టీయూసీఐ**



**టీ మీడియా,ఆగస్టు23,సింగరేణి(కారేపల్లి):**

మాధారం డోలమైట్ మైన్స్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలలుగా పనులు లేక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వారికి పనులుకల్పించాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.రామయ్య డిమాండ్ చేశారు. శనివారం కారేపల్లి మండలం మాధారంలోని డోలమైట్ మైన్స్ కార్యాలయంలో సీవిల్ ఇంజనీర్ ప్రవీణ్ ను కలిసి వినతిపత్రం అందేశారు. ఈసందర్భంగా జీ.రామయ్య మాట్లాడుతూ డోలమైట్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా 30 ఏండ్లుగా పని చేస్తున్నారని వారికి పనులు కల్పించక పోవటంతో జీవనాధారం కోల్పుతున్నారన్నారు. మైన్స్‌లో రైల్వే పనులు టెండర్ వేసిన టెండర్‌దారుడు వర్క్ అర్డర్ తీసుకోక పోవటంతో మైన్స్ యాజమాన్యం పనులు నిర్వస్తుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు 26 రోజుల పని దినాలు కల్పించాల్సి ఉండగా కేవలం 11 రోజులు పనులు కల్పిస్తుందన్నారు. రిటెండర్ పిలవాల్సిన యాజమాన్యం దానికి చర్యలు తీసుకోవటం లేదన్నారు. వందలాది మందికి ఉపాధి కల్పించిన మాదారం స్టీల్ ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు కట్టపెట్టటానికి నష్టాలబూచి చూపుతున్నారన్నారు. ప్రయివేటీకరణతో కార్మికులకు ఉపాధీ కరువవుతుందని దీనిపై ఐక్య పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మాదారం స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ ఖైరుద్దీన్, బాదావత్ వీరు, రవికుమార్, ఇబ్రహీం, హుస్సేన్, ఈరన్న,గుండెబోయిన లక్ష్మినారాయణ, కళావతి, ప్రసాద్, షేక్ మీరా, వీరన్న తదితరులు పాల్గొన్నారు.